VEGA JEWELLERS
దివిలోనైనా... భువిలోనైనా.. వేగ తోడుంటే
వివాహం వైభోగం అవుతుంది.
ఆంధ్రప్రదేశ్ | తెలంగాణ | USA
follow us vegajewellers

కలం కౌంటర్
KALAM COUNTER TELUGU DAILY
తెలుగు దినపత్రిక
సంపుటి : 9 సంచిక : 312
పేజీలు : 4 వెల రూ.4/-
Circulated by : Krishna, Guntur, Prakasam, Nellore, West Godavari, Khammam, Hyderabad, Chittor
గురువారం 30 ఏప్రిల్ 2026

# ప్రతీ బూత్ పరిధిలో గతానికి మించి ఓట్లు రావాలి

● చేసిన అభివృద్ధి చెబుదాం... తెచ్చిన మార్పు చెబుదాం... పడిన కష్టం చెబుదాం ● లోకేష్... శభాష్ ● పర్మిషన్లతో కాదు... పనితోనే పదవులు ● సీనియార్టీ... సిన్సియార్టీ... సోషల్ రీ-ఇంజనీరింగ్ తో కమిటీ కూర్పు ● అహం వద్దు... బేషజాలకు పోవద్దు ● 2024కు ముందు జరిగిన ప్రతీ ఘటన గుర్తుంది... మనం చేసిన ప్రతీ పోరాటం గుర్తుంది ● గూగులే కాదు... స్వాతంత్ర్యం తెచ్చామని కూడా గొడ్డలి పార్టీ చెబుతుంది ● టీడీపీ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవ సభలో సీఎం చంద్రబాబు ● కొత్త కార్యవర్గంతో ప్రమాణస్వీకారం చేయించిన చంద్రబాబు




**అమరావతి, కలంకౌంటర్ :** ప్రతీ పోలింగ్ బూత్ పరిధిలో గతానికి మించి కూటమి పార్టీలకు ఓట్లు రావాలని టీడీపీ కొత్త కార్యవర్గానికి, నేతలకు, కార్యకర్తలకు పార్టీ జాతీయ అధ్యక్షుడు, సీఎం నారా చంద్రబాబు నాయుడు దిశా నిర్దేశం చేశారు. 2024లో వచ్చిన ఓట్లకంటే ఎక్కువ ఓట్లు రావాలని లీడర్లు, కేడర్ కు టార్గెట్ ఫిక్స్ చేశారు. బుధవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ కొత్త కార్యవర్గ ప్రమాణస్వీకారోత్సవానికి సీఎం చంద్రబాబు హాజరయ్యారు. పొలిట్ బ్యూరో, జాతీయ, రాష్ట్ర కమిటీ సభ్యులతో ప్రమాణం చేయించారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ గా నారా లోకేష్ బాధ్యతలు స్వీకరించారు. పాత–కొత్త కలయికతో టీడీపీ అధినాయకత్వం కమిటీలను ఏర్పాటు చేసింది. పార్టీ చరిత్రలో తొలిసారిగా మండల, క్లస్టర్ స్థాయి నేతలకు పొలిట్ బ్యూరోలో చంద్రబాబు, లోకేష్ చోటు కల్పించారు. కార్యకర్తే అధినేత అనే నినాదాన్ని నిజం చేస్తూ పని చేసిన వారికే కమిటీల్లో పెద్ద పీట వేశారు. సీనియర్ల సారధ్యం... జూనియర్ల దూకుడును సమ–పాళ్లలో కలుపుతూ కమిటీల నియామకాన్ని చేపట్టారు. గతంలో సోషల్ మీడియాలో యాక్టీవ్‌గా పనిచేసిన వారికి కమిటీలో చోటు కల్పించారు. ఎన్టీఆర్, చంద్రబాబు అధ్యక్షులుగా ఉన్నప్పుడు... లోకేష్ వర్కింగ్ ప్రెసిడెంటుగా బాధ్యతలు స్వీకరిస్తున్న కమిటీల్లోనూ యనమల రామకృష్ణుడు, గోరంట్ల బుచ్చయ్య చౌదరి వంటి వారు కీలక బాధ్యతలు చేపట్టారు. కొత్త కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవంలో వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ హైలెట్ గా నిలిచారు. పార్టీలో కొత్తగా కొలువు తీరిన కార్యవర్గానికి.. నేతలకు, కేడర్ కు చంద్రబాబు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు మాట్లాడుతూ..."మరో 3 ఏళ్లలో మళ్లీ ఎన్నికలు వస్తాయని ప్రతి ఒక్కరూ గుర్తుపెట్టుకోవాలి. రాష్ట్రాన్ని పునర్ నిర్మాణం చేసేందుకే కూటమికి ప్రజలు ఓట్లేశారు. వచ్చే ఎన్నికల్లో 2024లో వచ్చిన ఓట్లకంటే ఎక్కువ ఓట్లు రావాలి... అప్పుడే బాగా పని చేసినట్టు. ఓటు బ్యాంక్ నిత్యం పెరుగుతూనే ఉండాలి. పార్టీ ప్రతిష్ట పెరిగేలా ప్రతి ఒక్కరూ పని చేయాలి. పార్టీ శాశ్వతంగా ఉండాలి.. తెలుగుదేశం బాగుంటే.. రాష్ట్రం బాగుంటుంది. రాష్ట్రంలో చేసిన అభివృద్ధిని.. ఇస్తోన్న సంక్షేమాన్ని... తెచ్చిన మార్పును... పడిన కష్టాన్ని ప్రజలకు చెబుదాం. ప్రతిదీ నిష్టతో.. మనస్సుతో.. భవిష్యత్తు కోసం పని చేయాలి. స్థానిక సంస్థల ఎన్నికలు వన్ సైడ్ గా ఉంటాయి."అని చంద్రబాబు చెప్పారు.

**తలవంచని... మీసం మేలేసే కేడర్ టీడీపీ సొంతం...** "ఎన్నో వడపోతలు, లెక్కలు, ఈక్వేషన్లతో కమిటీలను ఏర్పాటు చేశాం. సీనియర్లను గౌరవిస్తూ... కొత్తవారికి అవకాశాలు ఇస్తూ.. కష్టపడిన వారికి చోటిస్తూ కమిటీలను ఏర్పాటు చేశాం. తెలుగుదేశం కార్యకర్తలు ఎప్పుడూ మీసం మేలేస్తారు.. ఎవ్వరికీ తలవంచరు. తెలుగుజాతి ఉన్నంత వరకు తెలుగుదేశం పార్టీ ఉంటుంది. కార్యకర్తే అధినేత అనేది నినాదంగా కాదు... విధానంగా మార్చుకున్నాం. మండల పార్టీ అధ్యక్షురాలికి.. క్లస్టర్ ఇన్చార్జికి పొలిట్ బ్యూరోలో స్థానం కల్పించాం. మహిళలకు ఎక్కువగా అవకాశాలిచ్చాం. మహిళా బిల్లుకు పూర్తిగా మద్దతిచ్చాం. చదువుకున్న వారికి మంత్రి పదవులిచ్చి ప్రోత్సహించాం. రామ్మోహన్నాయుడు, శబరి, రాజేష్ వంటి వారిని జాతీయ ఉపాధ్యక్షులుగా చేసుకున్నాం. సినీయార్టీ, సిన్సియార్టీ, సోషల్ రీ–ఇంజనీరింగ్ వంటి కసరత్తు చేసి కమిటీ కూర్పు చేపట్టాం. ప్రతిపక్షంలో లోకేష్ చాలా కీలక పాత్ర పోషించారు. కేడర్ ను నిరంతరం మోటివేట్ చేశారు. అధికారంలోకి వచ్చాక.. పార్టీని గేరప్ చేశారు. ట్రైనింగ్ క్లాసులు మొదలుకుని... కార్యకర్తల సంక్షేమ బాధ్యతలను లోకేష్ సమర్థవంతంగా నిర్వహించారు. 20 లక్షల మందికి ఉద్యోగాలిస్తామనే హామీని నెరవేర్చేందుకు లోకేష్ కృషి చేస్తున్నారు. ప్రపంచ ప్రసిద్ధ కంపెనీలు ఏపీకి వచ్చాయంటే కారణం లోకేషే. లోకేష్ సమర్థతను గుర్తించే వర్కింగ్ ప్రెసిడెంట్ బాధ్యతలు అప్పగించాం. వర్కింగ్ ప్రెసిడెంట్ అనేది పదవి కాదు.. అత్యున్నత బాధ్యత. అప్పగించిన పదవిని బాధ్యతతో నిర్వహించాలి. 2024కు ముందున్న పరిస్థితులన్నీ అందరికీ తెలుసు. నాకు ప్రతి ఘటనా... ప్రతి ఒక్కరి పోరాటం నాకు గుర్తుంది. కార్యకర్తలు పడ్డ కష్టాలు నాకు గుర్తున్నాయి."అని సీఎం చెప్పారు.

**గాడిన పెడుతున్నాం... లక్ష్యాలను చేరుకుంటున్నాం..** "వెంటిలేటర్ మీదున్న ఆర్థిక వ్యవస్థను కేంద్ర సాయంతో గట్టెక్కిస్తున్నాం. ఒక్కొక్కడుగు వేస్తున్నాం... వ్యవస్థలను గాడిలో పెడుతున్నాం. నిలిచిన కేంద్ర పథకాలను పునరుద్ధరించాం. అప్పులను రీ–షెడ్యూల్ చేస్తున్నాం. సూపర్ సిక్స్ హామీలు నెరవేర్చాం. సంక్షేమం అందిస్తున్నాం. సుపరిపాలనతో వాట్సాప్ సేవలు అందిస్తున్నాం. ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాం. ఇరిగేషన్ ప్రాజెక్టులు పరుగులు పెట్టిస్తున్నాం. పోలవరం, అమరావతి పనులు చేపడుతున్నాం. స్టీల్ ప్లాంట్ ను రివైవ్ చేయగలుగుతున్నాం. తెలుగు జాతి ఆత్మగౌరవాన్ని కాపాడుకున్నాం. రాష్ట్రానికి గత పాలనలో పోయిన బ్రాండ్.. నమ్మకాన్ని తిరిగి తీసుకురాగలిగాం. స్వర్ణాంధ్ర లక్ష్యాలకు అనుగుణంగా పని చేస్తున్నాం. విధ్వంసమైన విద్యుత్ వ్యవస్థను పునరుద్ధరించాం. ట్రూ అప్ ఛార్జీ భారం భరిస్తున్నాం. ట్రూ డౌన్ ఛార్జీల ద్వారా ప్రజలపై విద్యుత్ భారం తగ్గిస్తున్నాం. కరెంట్ ఛార్జీల పెంచకుండా పాలన చేపడుతున్నాం. విద్యుత్ కొనుగోళ్ల ధరలు తగ్గించేలా చర్యలు చేపడుతున్నాం. గతేడాది 30 పైసలు తగ్గించాం... మరో 30 పైసలు తగ్గించేలా ప్రణాళికలు రూపొందించాం. కరెంట్ ఛార్జీలు తగ్గించే ఆలోచనతో పని చేస్తున్నాం. పోర్టులు, ఎయిర్ పోర్టులు, హైవేలు పూర్తి చేసుకుంటున్నాం. విశాఖను టెక్ నగరంగా మారుస్తాం. రెవెన్యూ రికార్డులను ప్రక్షాళన చేస్తున్నాం. నిధుల లభ్యత తక్కువగా ఉన్నా... సమర్థ పాలనతో పనులన్నీ చేస్తున్నాం. తెలంగాణలో రాష్ట్ర ఆదాయంలో జీతాలకు 45 శాతం ఖర్చు పెడుతోంటే... మన రాష్ట్రానికి వచ్చే ఆదాయంలో 99 శాతం జీతాలకు ఖర్చు పెడుతున్నాం. అభివృద్ధి–సంక్షేమం ఆగకూడదని నిరంతరంగా కార్యక్రమాలు చేపడుతున్నాం. ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని.. ఎంతో కష్టపడి పని చేస్తున్నాం. ఠంచనుగా ఒకటో తేదీనే పెన్షన్లు ఇస్తున్నాం. దేశంలోని బెస్ట్ పాలసీలను అమలు చేస్తున్నాం."అని సీఎం వివరించారు.

**గొడ్డలి పార్టీకి జజ్జణ సోకింది..** "మనం చేసిన

- 2లో

## టీడీపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గా బాధ్యతలు చేపట్టిన నారా లోకేష్

● మంత్రి నారా లోకేష్ ను కలిసి అభినందనలు తెలిపిన పలువురు నేతలు









**మంగళగిరి,కలంకౌంటర్ :** తెలుగుదేశం పార్టీలో మరో చరిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతమైంది. తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టిన నారా లోకేష్ కు పలువురు నేతలు అభినందనలు తెలిపారు. పార్టీ కేంద్ర కార్యాలయంలోని తన చాంబర్ లో పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు మంత్రి నారా లోకేష్ ను కలిసి అభినందనలు తెలిపారు. టీడీపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గా ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యనిర్వాహక అధ్యక్షులుగా నారా లోకేష్ పార్టీని మరింత ముందుకు తీసుకెళ్లాలని ఈ సందర్భంగా నేతలు ఆకాంక్షించారు. అంతకుముందు ఎంపీ, టీడీపీ పార్లమెంటరీ పార్టీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని మంత్రి నారా లోకేష్ సమక్షంలో కేక్ కట్ చేశారు. శ్రీకృష్ణదేవరాయలకు కేక్ తినిపించి మంత్రి నారా లోకేష్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## పదవి వచ్చిందనే అహంకారం వద్దు

● అందరినీ కలుపుకుని ముందుకుసాగాలి ● మిమ్మల్ని ఎలా గుర్తించామో మీరు కూడా అలాగే నాయకత్వాన్ని గుర్తించాలి ● పార్టీ నూతన కార్యవర్గ కమిటీ సభ్యులకు శిక్షణ తరగతుల్లో నారా లోకేష్ దిశానిర్దేశం



**మంగళగిరి,కలంకౌంటర్ :** పదవి వచ్చిందనే అహంకారం వద్దనీ, అందరినీ కలుపుకుని ముందుకుసాగాలని టీడీపీ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్, విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. బుధవారం ఉదయం పార్టీ కేంద్రకార్యాలయంలో నూతన కార్యవర్గ కమిటీ ప్రమాణస్వీకార మహోత్సవం అనంతరం నిర్వహించిన శిక్షణ తరగతుల కార్యక్రమానికి మంత్రి హాజరై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా పర్సనాలిటీ డెవలప్ మెంట్ క్లాస్ విన్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. పార్టీ నాయకులు నియోజకవర్గాల్లో అందరినీ కలుపుకుని ముందుకు సాగాలి. మిమ్మల్ని ఎలా గుర్తించామో మీరు కూడా నాయకత్వాన్ని గుర్తించాలి. నాయకుల పనితీరుపై ప్రతి మూడు నెలలకోసారి బేరీజు వేస్తాం. నిన్నటి వరకు వేరు, ఈ రోజు నుంచి వేరు. మీరు చేసే ప్రతి పని పార్టీకి వర్తిస్తుంది. మీరు మంచి చేస్తే పార్టీకి మంచి జరుగుతుంది. ప్రతి అంశంపైనా అవగాహన ఉండాలి. పార్టీ నిర్మాణం, నిర్వహణపై అవగాహన పెంచుకోవాలి. సమన్వయంతో ముందుకుసాగాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

## డిసెంబర్ నాటికి అన్ని ప్రభుత్వ సేవలూ ఆన్‌లైన్

● శరవేగంగా డ్రోన్ సిటీ మొదటి దశ పనులు ● శాటిలైట్ సమాచారం వినియోగించుకునేలా కార్యాచరణ ● ఆర్టీజీ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్దేశం



**అమరావతి,కలంకౌంటర్ :** ప్రభుత్వ శాఖలు అందిస్తున్న అన్ని సేవలు ఈ ఏడాది డిసెంబర్ నాటికల్లా ఆన్‌లైన్‌లో అందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. వాట్సప్ గవర్నెన్స్ మన మిత్ర పరిధిలోకి అన్ని సేవలు తీసుకు వస్తే ప్రజలకు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే పని ఉండదని చెప్పారు. ఆర్టీజీఎస్‌పై వివిధ శాఖల ఉన్నతాధికారులతో క్యాంపు కార్యాలయంలో బుధవారం ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. మనమిత్ర వాట్సప్ గవర్నెన్సు ద్వారా ప్రస్తుతం 1,035 సేవలు అందిస్తున్నామని తెలిపారు. వాట్సప్ గవర్నెన్సు సేవలు ప్రారంభించిన దగ్గర నుంచి ఇప్పటి వరకు రాష్ట్రంలో 54 లక్షల మంది 1.78 కోట్ల సేవలు పొందారని ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. వాట్సప్ గవర్నెన్స్ సేవల వినియోగం పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని సీఎం కు తెలిపారు. ఇప్పటి వరకూ 24 లక్షల మందికి పైగా వాట్సప్ గవర్నెన్సు సేవలు ఎలా పొందాలో అవగాహన కల్పించామని చెప్పారు. కర్నూలు జిల్లాలో ఏర్పాటు చేస్తున్న డ్రోన్ సిటీ ఫేజ్ 1 అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయని... ఇప్పటికే ప్లాంట్లు నెలకొల్పేందుకు ముందుకొచ్చిన 8 కంపెనీలకు భూముల కేటాయింపు పూర్తయ్యిందని, మే నెల రెండో వారంలో ఇవన్నీ గ్రౌండ్ అవుతాయని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. డ్రోన్ సిటీ మాస్టర్ ప్లాన్ ఖరారయ్యిందని అధికారులు ఇచ్చిన వివరణ పై స్పందించిన సీఎం... ఈ ఏడాది జూలై నాటికి మొదటి దశ పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

**సీసీ కెమేరాలతో నేర నియంత్రణ చర్యలు..** దేశంలో మరే రాష్ట్రంలోనూ లేనంతగా ఆంధ్రప్రదేశ్‌లో సీసీ టీవీ కెమేరాల ఏర్పాటు, వాటి వినియోగం, పర్యవేక్షణ జరుగుతోందని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. దీనివల్ల రాష్ట్రంలో నేరాల నియంత్రణ, నేరస్తులను గుర్తించడంతో పాటు... మిస్సింగ్ కేసుల ట్రేసింగ్, వాహనాల దొంగతనాల వంటి కేసులు వేగంగా కొలిక్కి వస్తున్నాయని చెప్పారు. అయితే సీసీ కెమేరాలు లేని ప్రాంతాల్లో ప్రైవేట్ వ్యక్తులు ఏర్పాటు చేసిన సీసీ కెమేరాల డేటాను కూడా ఇంటిగ్రేట్ చేయాలని, ప్రజల్లో దీనిపై అవగాహన కల్పించాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు. సీసీ కెమేరాలతో పాటు శాటిలైట్ డేటాను వినియోగించు కునేలా కార్యాచరణ చేపట్టాలని అధికారుకు సీఎం నిర్దేశించారు. శాటిలైట్ సమాచారాన్ని ఆర్టీజీఎస్ కు అనుసంధానించి వేగంగా చర్యలు చేపట్టేలా చూడాలన్నారు. ఇటీవల తిరుమల–తిరుపతి సమీపంలో శేషాచల అటవీ ప్రాంతంలో మంటలు వ్యాపించిన ఘటనపై వేగంగా స్పందించే అవకాశం ఉండేదన్నారు. డీజిల్, పెట్రోలు సరఫరా పై రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న తక్షణ చర్యలతో మళ్లీ సాధారణ స్థితికి నెలకొందని... అయితే సమస్య ఉత్పన్నం కాకముందే రియల్ టైమ్‌లో స్పందించేలా చర్యలు ఉండాలని సీఎం సూచించారు.

## ఇంధనాన్ని పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు: ఏపీ మంత్రి నాదెండ్ల మనోహర్



**అమరావతి,కలంకౌంటర్ :** ఇంధనాన్ని పక్కదారి పట్టిస్తూ, కృత్రిమ కొరత సృష్టించే వారిపై ఉక్కుపాదం మోపాలని ఏపీ పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ కొరత, అక్రమాలపై మంత్రి నాదెండ్ల అధికారులతో టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. అక్రమాలకు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించవద్దని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఇంధన బంకుల నిర్వహణపై పలు కీలక సూచనలు చేశారు. కొన్ని బంకుల్లో స్టాక్ ఉన్నప్పటికీ 'నో స్టాక్' బోర్డులు పెట్టి వినియోగదారులను ఇబ్బంది పెడుతున్నారని, అలాంటి యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇంధన లభ్యతను దృష్టిలో ఉంచుకుని ప్రస్తుతం అమలు చేస్తున్న 'రేషన్ పద్ధతి'ని కొనసాగించాలని సూచించారు. ముఖ్యంగా ఆక్వా, వరి రైతులకు వ్యవసాయ పనులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఇంధన సరఫరాలో ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి స్పష్టం చేశారు. సోషల్ మీడియా వేదికగా ఇంధన కొరతపై తప్పుడు వార్తలు వ్యాప్తి చేస్తూ ప్రజల్లో భయాందోళనలు సృష్టించే వారిని గుర్తించి, వెంటనే కేసులు నమోదు చేయాలని పోలీసు శాఖను ఆదేశించారు. ఇంధనం పోయడానికి నిరాకరిస్తున్న బంకులపై 1967 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదులు వస్తున్నాయని, వాటిపై జిల్లా అధికారులు తక్షణమే స్పందించి పరిష్కరించాలని మంత్రి ఆదేశించారు. గతంతో పోలిస్తే రాష్ట్రంలో బంకుల మూసివేత గణనీయంగా తగ్గిందని, చమురు కంపెనీల నుంచి ఇంధన సరఫరా కూడా మెరుగుపడిందని నాదెండ్ల మనోహర్ తెలిపారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన భరోసా ఇచ్చారు.

# ముగ్గురు చేనేత ప్రముఖులకు టీడీపీ పదవులు



ధనుంజయ



అనురాధ



డాక్టర్ సంజీవ్ కుమార్

**మంగళగిరి,కలంకౌంటర్ :** తెలుగుదేశం పార్టీ పదవులు చేనేత వర్గానికి చెందిన పద్మశాలి ప్రముఖులు ముగ్గురిని వరించాయి. గుంటూరు జిల్లా మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్ లో బుధవారం ఉదయం పార్టీ పాలకవర్గం ప్రమాణస్వీకారం చేసింది. గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన గుత్తికొండ ధనుంజయ రావు పార్టీ పొలిట్ బ్యూరో సభ్యునిగా ప్రమాణస్వీకారం చేయగా, రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా ఎన్టీఆర్ జిల్లా విజయవాడకు చెందిన పంచుమర్తి అనురాధ, కర్నూలుకు చెందిన డాక్టర్ శింగరి సంజీవ్ కుమార్ లు ప్రమాణ స్వీకారం చేశారు.

**గుత్తికొండ ధనుంజయ:** గుత్తికొండ సీతారామయ్య, లక్ష్మీకాంతమ్మ దంపతులకు ధనుంజయ రావు 1968 జూన్ 1వ తేదీన జన్మించారు. ఆయన ప్రాథమిక విద్య 5వ తరగతి వరకు మంగళగిరి మార్టి స్కూల్ లో చదివారు. ఆ తర్వాత చింతక్రింది కనకయ్య హైస్కూల్ లో 6వ తరగతి చదివారు. వివిధ కారణాల వల్ల చదువు మానివేశారు. ఆ తర్వాత 1989లో ప్రైవేటుగా ఆంధ్ర యూనివర్సిటీ మెట్రిక్ పరీక్ష రాసి పాసయ్యారు. 1990 మే 5న గుంటూరుకు చెందిన కాకుమాను పాపయ్య, తేరేజమ్మల కుమార్తె విజయకుమారిని వివాహం చేసుకున్నారు. **14 సంవత్సరాల వయసులో చేనేత మగ్గం నేస్తూ..** అప్పుడే పుట్టిన తెలుగుదేశం పార్టీలో సభ్యత్వం తీసుకున్నారు. ఎన్టీఆర్ మీద అభిమానంతో ఆయన ఎక్కడ సభలు పెట్టినా అక్కడికి వెళ్లేవారు. మొట్టమొదటిసారిగా మంగళగిరి నియోజకవర్గం తెలుగుదేశం అభ్యర్థిగా 1983లో, 1985లో పోటీ చేసిన డాక్టర్ ఎం.ఎస్.ఎస్ కోటేశ్వరరావుకి, 1989లో ఎలయన్స్ లో సిపిఎం అభ్యర్థి సింహాద్రి శివారెడ్డికి, 1994 సిపిఎం అభ్యర్థి నిమ్మగడ్డ రామ్మోహన్ రావు, 1999లో బీజేపి అభ్యర్థి ఎర్రపాటి రఘునాథ బాబుకి, 2004లో బీజేపి అభ్యర్థి తమ్మిశెట్టి జానకి దేవికి, 2009లో గుంటూరు పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేసిన మాదల రాజేంద్రకి, 2014లో గంజి చిరంజీవికి, 2019లో నారా లోకేష్ కి ఎన్నికల్లోమద్దతుగా పనిచేశారు. 2024 లో నారా లోకేష్ విజయం కోసం అంకితభావంతో పనిచేశారు. 1988లో పట్టణ తెలుగు నాడు చేనేత కార్మిక సంఘం ఉపాధ్యక్షులుగా, జిల్లా పార్టీ కార్యవర్గ సభ్యులుగా 1994 వరకు పనిచేశారు. 1995 నుండి పట్టణ తెలుగు నాడు చేనేత కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శిగా నిరంతరం శ్రమించారు. 2006లో కొత్తగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర చేనేత విభాగం ఏర్పాటు చేయగా, రాష్ట్ర కార్యవర్గంలో చేనేత విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా 2019 వరకు కొనసాగారు. 2022 నుండి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారు. బీసీలను కూడగట్టడంలో విశేష కృషి చేశారు. బీసీలను పార్టీ వైపు మళ్లించడానికి నిరంతరం శ్రమించి బీసీ నేతగా ఎదిగారు. ఓ పక్క చేనేత కార్మికుల కోసం పోరాడుతూ, మరోపక్క బీసీలను ఐక్యం చేయడంలో కీలక పాత్ర పోషిస్తూ, మరో పక్క అయిదేళ్ల నుంచి మంగళగిరి సాహితీ కళా వేదిక కన్వీనర్ గా కళాసేవ చేస్తున్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీనే నమ్ముకుని పని చేస్తూ, సౌమ్యుడిగా పేరు పొందిన ధనుంజయరావుని పార్టీ పొలిట్ బ్యూరో సభ్యునిగా నియమించింది.

**పంచుమర్తి అనురాధ: పంచుమర్తి అనురాధ:** స్వర్గం పుల్లారావు, లక్ష్మి దంపతులకు పంచుమర్తి అనురాధ 1974లో జన్మించారు. తండ్రి ప్రభుత్వ ఉద్యోగి కావడంతో ఆమె విద్యాభ్యాసం వివిధ ప్రాంతాలలో చేశారు. ప్రాథమిక విద్య హైదరాబాద్ సెయింట్ ఆన్స్ పాఠశాలలో, ఆ తర్వాత విజయవాడ అట్కిన్సన్ హైస్కూల్లో చదివారు. విజయవాడ స్టెల్లా కాలేజీల ఇంటర్ , గుంటూరు జేకేసీ కళాశాలలో బీఎస్సీ ఎలక్ట్రానిక్స్ పూర్తి చేశారు. డిగ్రీ చివరి సంవత్సరంలో ఉండగానే, ఆమె పారిశ్రామికవేత్త పంచుమర్తి శ్రీధర్ తో వివాహం జరిగింది. అనూరాధ వివాహానంతరం 2010లో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జర్నలిజంలో మాస్టర్ డిగ్రీ చేశారు. ఆమె తెలుగుదేశం పార్టీ ద్వారా రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. 2000లో విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ స్థానం బీసీ మహిళకు రిజర్వ్ చేశారు. మేయర్ టికెట్ కోసం ఆమె టీడీపీకి దరఖాస్తు చేసుకున్నారు. మొత్తం 18 మంది పోటీ పడగా, విద్యాధికురాలైన అనురాధకు చంద్రబాబు నాయుడు టికెట్ ఖరారు చేశారు. విజయవాడ కార్పొరేషన్ ఎన్నికల్లో పోటీ చేసి 6,800 ఓట్ల మెజారిటీతో మేయర్‌గా గెలిచారు. మేయర్‌గా ఎన్నికైన నాటికి ఆమె వయసు 26 సంవత్సరాలు మాత్రమే. దేశంలోనే అత్యంత పిన్నవయస్కురాలైన మేయర్‌గా ఆమె పేరు లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదైంది. పంచుమర్తి అనురాధ ఆ తరువాత పార్టీ కార్యదర్శిగా, అధికార ప్రతినిధిగా, రాష్ట్ర మహిళా ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా పనిచేశారు. అధికార ప్రతినిధిగా ప్రతిపక్షాల విమర్శలకు ధీటైన రీతిలో సమాధానాలు చెబుతూ, ఫైర్ బ్రాండ్ గా పేరుపొందారు. 2023లో ఆంధ్రప్రదేశ్ శాసనమండలికి జరిగిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. ఎమ్మెల్యేలు ఎంపిక చేసే కోటాలో ఆమె గెలుపొందారు. 2024 నవంబర్ 12న ఆంధ్రప్రదేశ్ శాసనమండలిలో చీఫ్ విప్‌గా అనురాధ నియమితురాలయ్యారు. ఇప్పుడు పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలయ్యారు.

**డాక్టర్ సంజీవ్ కుమార్:** వస్త్ర వ్యాపారరంగంలో ప్రముఖులైన శ్రీ శింగరి శ్రీరంగం, రంగమ్మ పుణ్య దంపతులకు 1967 జనవరి 3న కర్నూలు నగరంలో డాక్టర్ సంజీవ్ కుమార్ జన్మించారు. సంజీవ్ కుమార్ బాల్యం నుంచి ఆట పాటలతోపాటు చదువులో ప్రతిభ కనపరిచేవారు. శింగరి శ్రీరంగం కుటుంబంలో సంజీవ్ కుమార్ ఒక్కరే డాక్టర్ కాదు. ఆయన ఇద్దరు సోదరులు, ముగ్గురు సోదరీమ-ణులు మొత్తం ఆరుగురూ డాక్టర్లే. వారంతా ప్రభుత్వ కాలేజీలలో ఎంబీబీఎస్ సీట్లు సాధించడం విశేషం. అంతే కాదు, కోడళ్ళు, అల్లుళ్ళు, మనవళ్ళు, మనవరాళ్లు కూడా డాక్టర్లే. ఈ కుటుంబంలో మొత్తం 21 మంది డాక్టర్లు ఉన్నారు. 1984-1990లో కర్నూలు మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ డిస్టింక్షన్ లో ఉత్తీర్ణులయ్యారు. 1992-1995 మధ్య కాలంలో కర్నూలు మెడికల్ కాలేజీలో ఎంఎస్ జనరల్ సర్జరీ చదివారు. సంజీవ్ కుమార్ 1992 మార్చి 4న డాక్టర్ వసుంధరనుపెళ్లి చేసుకున్నారు.

డాక్టర్ సంజీవ్ కుమార్ 2006 నుంచి 2022 వరకు'ఆయుష్మాన్ ద ఫ్యామిలీ హాస్పిటల్'ద్వారా పేదలకు అందుబాటులో వైద్యం సేవలు చేశారు. రాజకీయాలలో స్థిరపడి, ప్రజలకు ఇంకా చేరువై సేవచేయాలని 2019లో రాజకీయాలలోకి ప్రవేశించారు. 2019 ఏప్రిల్ 11న ఆంధ్రప్రదేశ్ లో జరిగిన 17వ సార్వత్రిక ఎన్నికల్లో కర్నూలు లోక్ సభ నియోజకవర్గం నుంచి లక్షా 48వేల ఓట్ల మెజార్టీతో సంజీవ్ కుమార్ విజయం సాధించారు. కర్నూలు ఎంపీగా ప్రశ్నలు అడగడంలో, ప్రైవేటు బిల్లులు ప్రవేశపెట్టడంలో, చర్చలలో పాల్గొనడంలో ఆయన ఓ రికార్డును స్థాపించారు. డాక్టర్ సంజీవ్ కుమార్ 6 ప్రైవేటు బిల్లులు లోక్‌సభలో ప్రవేశ పెట్టారు. పార్లమెంట్ 72 సంవత్సరాల చరిత్రలో కర్నూలు ఎంపీగా ఎన్నికైన ఎవరూ సభలో ఇన్ని ప్రైవేటు బిల్లులు ప్రవేశపెట్టలేదు. కర్నూలుకు సంబంధించి లోక్ సభ చరిత్రలో డాక్టర్ సంజీవ్ కుమార్ సృష్టించిన రికార్డు ఇది. 17వ లోక్ సభలో డాక్టర్ సంజీవ్ కుమార్ 225 ప్రశ్నలు లేవనెత్తారు. ఒక పద్మశాలి లోక్ సభ సభ్యుడు ఈ స్థాయిలో ప్రశ్నించడం, చర్చలలో పాల్గొనడం, ప్రశ్నలు లేవనెత్తడం చేనేత వర్గాలు గర్వకారణంగా భావించాయి. ఉన్నత చదువులు చదివిన నిజాయితీపరులు లోక్ సభకు ఎన్నికైతే దేశానికి ఎంత ప్రయోజనకరమో డాక్టర్ సంజీవ్ కుమార్ చేసి చూపించారు. 2024 ఎన్నికల ముందే ఆయన టీడీపీలో చేరారు. డాక్టర్ సంజీవ్ కుమార్ విద్యార్హతలు, ప్రజాసేవా కార్యక్రమాలు, పార్లమెంటులో ఆయన చూపిన ప్రతిభ ఆదారంగా, ఆయనను పార్టీకి రాష్ట్ర ఉపాధ్యక్షునిగా ఎంపిక చేశారు.

**-శిరందాసు నాగార్జున, సీనియర్ జర్నలిస్ట్- 9440222914**

## వందశాతం చెత్త నిర్వహణ పక్కాగా చేపట్టండి

● కాలువల్లో, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వెయ్యద్దండి. ● ఇంచార్జి కమిషనర్ శారదా దేవి





**తిరుపతి,కలంకౌంటర్ :** నగరంలో ఉత్పత్తి అయ్యే చెత్తను వంద శాతం నిర్వహణ చేయాలని నగరపాలక సంస్థ ఇంచార్జి కమిషనర్ శారదా దేవి అధికారులకు సూచించారు. బుధవారం ఉదయం నగరంలో పలు ప్రాంతాల్లో అధికారులతో కమిషనర్ అకస్మిక తనిఖీలు నిర్వహించారు. అలాగే తూకివాకం వద్ద గల ఇంటిగ్రేటెడ్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్ ను పరిశీలించి ఆయా ప్లాంట్ల నిర్వహణ విధానాన్ని తెలుసుకున్నారు. అన్ని ప్లాంట్ల ద్వారా వందశాతం చెత్త నిర్వహణ పక్కాగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. త్రాగునీరు, మురుగునీరు కలుస్తున్నట్లు పిర్యాదులు వస్తున్నాయని, ఇంజినీరింగ్ అధికారులు వారిని గుర్తించి తగు చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి రోజు నీటి సాంద్రత పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. కాలువల్లో, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తున్నారని ఆలా వేయడం వలన ఎక్కడి మురుగునీరు అక్కడ ఆగిపోయి అపరిశుభ్రంగా తయారవుతోందని తెలిపారు. కావున మీ ఇంటి వద్దకు వచ్చే మా సిబ్బందికి తడి, పొడి చెత్త వేర్వేరుగా ఇచ్చి సహకరించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఇంచార్జి కమీషనర్ వెంట మునిసిపల్ ఇంజనీర్ గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డి.ఈ. లు మధు, రమణ, రెవిన్యూ అధికారి రవి, ఏసీపీ లు పార్వతి ప్రియ, మూర్తి, సర్వేయర్లు కోటేశ్వరరావు, గురువారెడ్డి, శానిటరీ సూపర్ వైజర్ చెంచయ్య, తదితరులు ఉన్నారు.

## డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని ప్రజాదర్బార్లో వినతిపత్రం అందించిన గ్రామస్తులు



**మోపిదేవి,కలంకౌంటర్ :** మోపిదేవి గ్రామపంచాయతీ పరిధిలోని రావివారిపాలెం నవీన్ నగర్ గ్రామస్తులు ఎన్నో సంవత్సరాలుగా డ్రైనేజీ సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు గ్రామపంచాయతీ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకునే నాథుడు కరువయ్యాడు ఎన్నికల సమయంలో రాజకీయ నాయకులు డ్రైనేజీ సమస్య పరిష్కరిస్తామని హామీలు ఇచ్చిన ఇప్పటివరకు అమలు చేసిన దాఖలాలు లేవు. నవీన్ నగర్ నందు సుమారు 70 రజకుల కుటుంబాలు నివాసం ఉంటున్నాయి మురుగు నీరు సరిగా వెళ్లకపోవడంతో దుర్వాసన మరియు దోమలు తో బాగా ఇబ్బంది పడుతున్నామని వర్షాకాలం రోడ్డుపైకి మురుగునీరు చేరడంతో అనేక రకాలైన వ్యాధులు వస్తున్నాయని గ్రామస్తులు తెలిపారు మా సొంత డబ్బులతో డ్రైనేజీ పూడిక తీసుకుంటున్నామని తెలిపారు.మంగళవారం నిర్వహించిన ప్రజా దర్బార్ లో నవీన్ నగర్ గ్రామస్తులు ఓగిరాల లీలా ప్రసాద్ ఆధ్వర్యంలో స్థానిక శాసనసభ్యులు మండలి బుద్ధ ప్రసాద్ కి వినతి పత్రం ఇచ్చి తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారుల పాలనలో అయినా అధికారులు స్పందించి త్వరగా డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని నవీన్ నగర్ గ్రామస్తులు కోరుతున్నారు.

## రాష్ట్ర టిడిపి కార్యదర్శిగా ప్రమాణస్వీకారం చేసిన అన్నా అనితాయాదవ్



**తిరుపతి,కలంకౌంటర్ :** తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కమిటీ కార్యదర్శిగా అన్న అనిత యాదవ్ ప్రమాణస్వీకారం చేశారు. బుధవారం నాడు మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో జరిగిన కమిటీ ప్రమాణస్వీకారం మహోత్సవం అత్యంత వేడుకగా జరిగింది. టిడిపి ప్రమాణ స్వీకార మహోత్సవంలో ముందుగా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు స్వర్గీయ శ్రీ నందమూరి తారకరామారావు విగ్రహానికి నివాళులర్పించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంత్రి నారా లోకేష్ సమక్షంలో నూతన కమిటీ సభ్యులతో కలిసి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా అన్న అనితా యాదవ్ ప్రమాణ-స్వీకారం చేశారు. అనంతరం తనను కలిసిన విలేకరులతో మాట్లాడుతూ ప్రజా సంక్షేమం,అభివృద్ధి, పరిపూర్ణమైన రాజనీతి దర్శకుడు అంటే చంద్రబాబునాయుడుఅని అలాంటి నాయకుడు మన రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉండడం ప్రజల అదృష్టమన్నారు. ఇక ఎన్నికల ముందు రాష్ట్రవ్యాప్తంగా ఎన్నో శ్రమలను అదికమించిన యువగళం రథసారథి రాష్ట్ర ఐటి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తన పాదయాత్రల సందర్భంగా రాష్ట్ర ప్రజల ఎదుర్కొంటున్న సమ-స్యల పైన గత పాలకులు రాష్ట్ర అభివృద్ధిని ఎలా విధులు చేశారు, ఎలా అవినీతి కుంభకోణాలులకు పాల్పడ్డారు అన్న అంశంపై పరిపూర్ణమైన అవగాహన పొందిన యువనేతగా ముందుకు సాగుతున్నారు అని ఆన్నారు.అలాంటి నాయకుల సారధ్యంలో కార్యదర్శిగా పార్టీలో ఉండడం ఒక గొప్ప అవకాశం గా భావిస్తున్నాను అని అన్న అనితా యాదవ్అన్నారు. ఏదేమైనా ఆంధ్ర ప్రజల బంగారు భవిష్యత్తు కూటమి ప్రభుత్వం తోనే సాధ్యమని ఆమె అన్నారు.

## బంటుమిల్లిలో మాజీ చీఫ్ విప్ కాగిత వర్ధంతి...





**బంటుమిల్లి,కలంకౌంటర్ :** బంటుమిల్లి మండలం బంటుమిల్లి గ్రామంలో మాజీ టీటీడీ చైర్మన్, చీఫ్ విప్, మరియు మాజీ శాసనసభ్యులు కీ"శే" కాగిత వెంకట్రావు పంచమ వర్ధంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వర్ధంతి వేడుకల్లో దివంగత కాగిత వెంకట్రావు కుమారుడు పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు. ఈ వేడుకలలో భాగంగా బంటుమిల్లి గ్రామంలో హీరో షోరూం దగ్గర కీ"శే" కాగిత వెంకట్రావు పంచమ వర్ధంతి సందర్భంగా కాగిత వెంకట్రావుచిత్రపటానికి ఎమ్మెల్యే తాడిచే కృష్ణ ప్రసాద్ మరియు పలువురు నాయకులు కాగిత అభిమానులు పూలమాలలువేసి నివాళు లు అర్పించారు. అనంతరం ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ చలివేంద్రాన్ని ప్రారంభించారు. బంటుమిల్లి అంబేద్కర్ సెంటర్ వద్ద కీ"శే" కాగిత వెంకట్రావు పంచమ వర్ధంతి సందర్భంగా దివంగత మాజీ ఎమ్మెల్యే కాగిత వెంకట్రావు చిత్రపటానికి ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ పూలమాల వేసి నివాళులు అర్పించి మజ్జిగ పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు ప్రజలు తదితరులు పాల్గొన్నారు..

## ఏఐతో ఉద్యోగాలు కోల్పోతామనే భయాలు నిరాధారమైనవి

● ఏఐ సాధనాలలో నైపుణ్యం సాధించడం విద్యార్థులకు అపారమైన అవకాశాలను అందిస్తుంది

● ఆస్ట్రేలియాకు చెందిన ఏఐ నిపుణుడు డాక్టర్ ఎ శ్రీనివాసులు ● వికాస్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్‌లో అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలపై అంతర్జాతీయ సదస్సు ప్రారంభం




**విజయవాడ రూరల్,కలంకౌంటర్ :** ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వల్ల ఉద్యోగాలు కోల్పోతామనే భయాలు చాలా వరకు నిరాధారమైనవని ఆస్ట్రేలియాలోని న్యూకాజిల్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ ఎ. శ్రీనివాసులు స్పష్టం చేశారు. ఏఐ చుట్టూ పెరుగుతున్న ఆందోళనలను హైలైట్ చేస్తూ ఏఐ సాధనాలలో నైపుణ్యం సంపాదించడం అభివృద్ధి చెందుతున్న ప్రపంచ ఉద్యోగ మార్కెట్‌లో విద్యార్థులకు అపారమైన అవకాశాలను అందిస్తుందని నొక్కి చెప్పారు. విజయవాడ రూరల్ మండలం, నూన్నలోని వికాస్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ (వీజీటీఎన్)లో బుధవారం ప్రారంభమైన ఇంజనీరింగ్, ఫార్మా మరియు లైఫ్ సైన్సెస్‌లో అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలపై రెండవ అంతర్జాతీయ సదస్సు--2026 లో ఆయన కీలకోపన్యాసం చేశారు. ఇంజనీరింగ్, ఫార్మాస్యూటికల్ మరియు లైఫ్ సైన్సెస్ రంగాలలో తాజా పురోగతులపై చర్చించడానికి ఈ రెండు రోజుల సదస్సు నిపుణులను, పరిశోధకులను మరియు విద్యార్థులను ఒకచోట చేర్చింది. సభ్యులను ఉద్దేశించి ప్రసంగిస్తూ, డాక్టర్ శ్రీనివాసులు క్వాంటం కంప్యూటింగ్, జెనరేటివ్ ఏఐ, డేటా సైన్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ) మరియు బ్లాక్‌చెయిన్ వంటి వర్ధమాన సాంకేతికతలలో వేగంగా జరుగుతున్న అభివృద్ధిని ప్రముఖంగా ప్రస్తావించారు. ఈ రంగాలలో నైపుణ్యం విదేశాలలో అవకాశాలకు ద్వారాలు తెరుస్తుందని పేర్కొంటూ, విద్యార్థులు తమ ప్రపంచ కెరీర్ అవకాశాలను మెరుగుపరచుకోవడానికి ఈ అత్యాధునిక రంగాలపై దృష్టి పెట్టాలని ఆయన ప్రోత్సహించారు. నాణ్యమైన మౌలిక సదుపాయాలు మరియు విద్యాపరమైన మద్దతును అందించినందుకు వికాస్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ యాజమాన్యం, ప్రిన్సిపాల్ మరియు అధ్యాపక బృందాన్ని కూడా ఆయన అభినందించారు. ఈ సంస్థ విద్యార్థులు జాతీయ మరియు అంతర్జాతీయ వేదికలపై చురుకుగా పరిశోధనా పత్రాలను సమర్పిస్తూ ప్రశంసలు పొందుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఇంజనీరింగ్ మరియు ఫార్మాస్యూటికల్ సైన్సెస్‌ను ఏకీకృతం చేస్తున్నందున ఈ సదస్సు ప్రత్యేకమైనదని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.ఎస్. శ్రీనివాస్ అన్నారు. అవకతవకలను నివారించే లక్ష్యంతో ఒక పరీక్షా అప్లికేషన్‌ను అభివృద్ధి చేసినందుకు విద్యార్థులు ఇటీవల విశాఖపట్నంలో జరిగిన 'సృజన' రాష్ట్ర స్థాయి సమావేశంలో మూడవ బహుమతిని గెలుచుకున్నారని ఆయన తెలిపారు. రతన్ టాటా ఇన్నోవేటివ్ హబ్‌లో విద్యార్థులు తమ ఆలోచనలను ప్రదర్శించి, తదుపరి స్థాయికి పురోగమించారని ఆయన ఇంకా పేర్కొన్నారు. అమెరికా, ఐరోపా దేశాలతో సహా 12 దేశాల నుంచి సుమారు 48 పరిశోధనా పత్రాలు, భారతదేశంలోని 22 విశ్వవిద్యాలయాల నుంచి 65 పత్రాలు అందినట్లు వీజీటీఎన్ కార్యదర్శి, కరస్పాండెంట్ నారెడ్ల సత్యనారాయణ రెడ్డి తెలిపారు. ఇలాంటి అంతర్జాతీయ సదస్సులను క్రమం తప్పకుండా నిర్వహించి, జాతీయ అక్రిడిటేషన్ ర్యాంకింగ్‌లలో విజయవాడలో అగ్రగామి సంస్థగా ఎదగాలని తమ సంస్థ లక్ష్యంగా పెట్టుకుందని ఆయన అన్నారు. ఇతరులతో పాటు, HCL Tech (USA) డిప్యూటీ జనరల్ మేనేజర్ జాకబ్ పుష్పరాజ్, MSH Academy of Research మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ టి. రాజా సంతోష్, సదస్సు సమన్వయకర్త చి. కిషోర్ రెడ్డి మరియు పలువురు విద్యావేత్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## నారా లోకేష్ కు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే ఇంటూరి





**కందుకూరు, కలంకౌంటర్ :** తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన విద్యాశాఖ మంత్రి, యువనేత నారా లోకేష్ కి..... ఉమ్మడి ప్రకాశం జిల్లా అధ్యక్షులు ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, మంత్రి డోల బాల వీరాంజనేయ స్వామి, మరో మంత్రి గొట్టిపాటి రవి , సహచర ఎమ్మెల్యేలతో కలిసి శుభాకాంక్షలు తెలియజేసిన కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు.

# సీఎం చంద్రబాబు నాయుడు ఆశీస్సులు తీసుకున్న ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్

- ఎమ్మెల్సీ శ్రీకాంత్ కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన సీఎం చంద్రబాబు



**మంగళగిరి, కలంకౌంటర్ :** మంగళగిరి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యనిర్వహక కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా, అదేవిధంగా తన పుట్టినరోజు సందర్భంగా ప్రభుత్వ విప్, కుప్పం అర్బన్ డెవలప్మెంట్ చైర్మన్, ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ కు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశీస్సులు అందజేశారు. అదే సమయంలో ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ కు సీఎం చంద్రబాబు నాయుడు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తనకి కార్యనిర్వహక కార్యదర్శిగా అవకాశం కల్పించినందుకు జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడుకు, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ కు ధన్యవాదాలు తెలిపారు.

# పెండింగ్ లో ఉన్న కేసులు త్వరగా పరిష్కరించాలి

– డీఎస్పీ సి హెచ్ వి బాలసుబ్రమణ్యం



**కందుకూరు,కలంకౌంటర్ :** పెండింగ్లో ఉన్న కేసులు త్వరితగతిన పరిష్కరించాలని కందుకూరు డిఎస్పి సిహెచ్ వి బాలసుబ్రమణ్యం పోలీస్ అధికారులను ఆదేశించారు. కందుకూరు సబ్ డివిజనల్ ఆఫీసు నందు డీఎస్పీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన నేర సమీక్షా సమావేశంలో డి.ఎస్.పి బాలసుబ్రమణ్యం అన్ని స్టేషన్ పరిధిలోని వివిధ కేసుల పురోగతిని గూర్చి పరిశీలించారు. ఈ సందర్భంగా పెండింగ్లో ఉన్న కేసులను త్వరగా పరిష్కరించాలని ఎస్ఐలకు సూచించారు. ఈ కార్యక్రమంలో కందుకూరు సిఐ షేక్ అన్వర్ భాష, గుడ్లూరు సీఐ, కొండపిసిఐ రమణయ్య , కందుకూరు పట్టణ ఎస్సై శివ నాగరాజు, రూరల్ ఎస్సై బాలకృష్ణ, ఉలవపాడు, లింగసముద్రం, వివి పాలెం, పొన్నలూరు, మర్రిపూడి, కొండపిఎస్ఐలు పాల్గొన్నారు.



ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్ కుమార్తె త్రిలోక్య పావని - ప్రభాస్ ల నిశ్చితార్థం కార్యక్రమానికి హాజరై ఆశీర్వదించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు

–విజయవాడ, కలంకౌంటర్ :





# రిజర్వు బ్యాంక్లో ఉద్యోగ అవకాశాలు -పి.బి. సిద్ధార్థలో ఆర్బీఐ ఏజీఎం రూప



**ఉయ్యూరు,కలంకౌంటర్ :** భారత రిజర్వు బ్యాంకుకు దేశవ్యాప్తంగా 33 కార్యాలయాలు, అనేక శిక్షణ కేంద్రాలు ఉన్నాయని, ఈ కేంద్ర బ్యాంకులో ఆఫీసు అసిస్టెంట్, ఇతర ఉద్యోగఖాళీల భర్తీకి వెలువడే నోటిఫికేషన్లు ఆర్బీఐ వెబ్ సైట్ లో చూడాలని ఆర్బీఐ విజయవాడ ప్రాంతీయ కార్యాలయం ఏజీఎం రూప ఆర్.సి. అన్నారు. బుధవారం ఉదయం విజయవాడ పి. బి. సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఎంబీఏ విభాగం సెమినార్ హాలులో బ్యాంకింగ్ రంగంలో మహిళలకు ఉపాధి అవకాశాలు అనే అంశంపై నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రూప మాట్లాడుతూ తాను యూపీఎస్సీకి శిక్షణ తీసుకుంటున్న తరుణంలో పదేళ్లక్రితం ఆర్బీఐ ఉద్యోగానికి ఎంపిక అయ్యానన్నారు. ప్రస్తుతం ఆర్బీఐ గోల్డెన్ జూబ్లీ స్కాలర్షిప్ అందుబాటులో ఉందని, ఇటీవల విజయవాడలో ఆర్బీఐ ప్రాంతీయ కార్యాలయం ప్రారంభమైనందున పీజీ విద్యార్థులు ఇంటర్న్ షిప్ కి ఆర్బీఐని ఎంపిక చేసుకోవచ్చని, జిందాల్ వెబ్ సైట్ తదితర వనరుల నుంచి బ్యాంకింగ్ పరీక్షలకు తయారయ్యే విద్యార్థులు వర్తమాన అంశాలపై ఎప్పటికప్పుడు సమాచారాన్ని సేకరించుకోవాలన్నారు. జనరల్ ఇంగ్లీష్ పై పట్టు సాధించాలన్నారు. ప్రజల విశ్వాసం పెంచడానికి బ్యాంకుల అజమాయిషీ అవసరమని, ఆ దిశగా 1935లో ఏర్పాటైన ఆర్. బి. ఐ. దేశంలో ఆర్థిక స్థిరత్వానికి చర్యలు తీసుకుంటోందన్నారు. కరెన్సీ స్థిరత్వం, వినియోగదారుల ఆర్థికరక్షణ ఆర్బీఐ లక్ష్యమని చెప్పారు. గ్రామీణ బ్యాంకింగ్ వ్యవస్థను ప్రోత్సహించడం, ప్రభుత్వానికి ఆర్థిక సలహాలు ఇవ్వడం ఆర్బీఐ విధుల్లో భాగమన్నారు. కళాశాల డీన్ ఆచార్య రాజేష్ సి. జంపాల మాట్లాడుతూ అమరావతిలో పెద్ద ఎత్తున బ్యాంకింగ్ వ్యవస్థ తరలి వస్తున్నందున ఉపాధికి కొదువ లేదని, మహిళలు దూరతీరాలకు వెళ్ళనవసరం లేదన్నారు. ఈ సందర్భంగా డీన్ ఆచార్య రాజేష్ సి. జంపాల, పీవీపీ ఇంజనీరింగ్ కాలేజీ ఎం.బి.ఎ. విభాగాధిపతి డా.పి. ఆదిలక్ష్మి, పీబీ సిద్ధార్థ ఆచార్యులు డా. బాబూ రాజేంద్రప్రసాద్, ఎండి రెహ్మాన్ తదితరులు రూపను సత్కరించారు.

# మజ్జిగ పంపిణీ



**మచిలీపట్నం,కలంకౌంటర్ :** నడక మిత్ర మండలి ఆధ్వర్యంలో 15వ రోజు మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు ఈరోజు మజ్జిగ దాత శ్రీ రంగనాయక స్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డు మెంబర్ అన్నం స్వరాజ్యలక్ష్మి , వంశీ జ్యూయలర్స్ అన్నం బాబురావు .ఈ కార్యక్రమంలో అధ్యక్షులు జల్లు మురళి నాథ్ అన్నం అవినాష్ తదితర సభ్యులు పాల్గొన్నారు

# జిల్లాలో ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు వేగవంతం చేయాలి - జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ







**మచిలీపట్నం,కలంకౌంటర్ :** జిల్లాలో ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు వేగవంతం చేయాలని, బుధవారం రాత్రి కల్లా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వచ్చే మే నెల 1వ తేదీన పామర్రు నియోజకవర్గం పమిడిముక్కల మండలంలో పర్యటిస్తున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ బుధవారం ఉదయం మండలంలో ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వివిధ శాఖ అధికారులతో ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. తొలుత కలెక్టర్ మండలంలోని కపిలేశ్వరపురం గ్రామంలో హెలిప్యాడ్, బారికేడ్లను పరిశీలించి ముఖ్యమంత్రి రాక కోసం వేచి ఉండే అతిథులకు, అధికారులకు నీడనిచ్చే షామియానా వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. తదుపరి పమిడిముక్కల గ్రామంలో ఏర్పాటు చేస్తున్న ప్రజావేదిక నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. ప్రాంగణంలో పనులు చాలా నిదానంగా జరుగుతున్నాయని ఎర్రమట్టి తోలకం, ప్రదర్శనశాలల ఏర్పాటు వేగవంతం చేయాలని. సూచించారు. అప్రోచ్ రహదారిని వెంటనే నిర్మించాలన్నారు. బుధవారం రాత్రికల్లా ఎట్టి పరిస్థితుల్లోనైనా పనులు పూర్తి చేయాలన్నారు. భవన నిర్మాణ కార్మికులతో ముఖ్యమంత్రి ముఖాముఖి నిర్వహించేందుకు వీలుగా జాబితా సిద్ధం చేయాలన్నారు. కార్మిక శాఖ పోర్టల్ లో వారు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు వీలుగా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు ప్రజా వేదికపై ముఖ్యమంత్రితో కూర్చునే లబ్ధిదారుల పేర్లను ఖరారు చేయాలన్నారు. వీరంకి లాకులలోని ఎన్టీఆర్ కాలనీలో ముఖ్యమంత్రి పంపిణీ చేసే పింఛను లబ్దిదారుల జాబితా సిద్ధం చేయాలన్నారు. శ్రమశక్తి బహుమతి గ్రహీతలను, మెటనెటి బెనిఫిట్స్ లబ్ధిదారుల జాబితా సిద్ధం చేయాలన్నారు వెంటనే సిద్ధం చేయాలన్నారు. ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాలన్నింటిలో ఎక్కడా కూడా చెత్తచెదారాలు లేకుండా సజావుగా పారిశుధ్యం నిర్వహించాలన్నారు. ప్రజా వేదిక వద్ద ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా తాగునీరు, సంచార మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలన్నారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట రాష్ట్ర కార్మిక శాఖ వైద్య బీమా కమిషనర్ శ్రీ ఆంజనేయులు, ఉయ్యూరు ఇంచార్జ్ ఆర్డిఓ శ్రీ బాలసుబ్రమణ్యం, కార్మిక శాఖ డి సి ధనలక్ష్మి, ఆర్ ఌ బి ఈఈ శ్రీ లోకేష్, డి ఈ బలరాం కార్మిక శాఖ ఏసి విష్ణు, తహసిల్దారు నవీన్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# గ్రూప్-1లో మెరిసిన యువతకు మంత్రి శుభాకాంక్షలు

- తాడేపల్లిలో మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన గ్రూప్-1 అధికారులు.
- RTOలుగా బాధ్యతలు స్వీకరించిన అధికారులకు మంత్రి అభినందనలు

**తాడేపల్లి,కలంకౌంటర్ :** తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి గారిని 2023 గ్రూప్-1లో విజయం సాధించిన అధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రూప్-1 ద్వారా ఎంపికై RTOలుగా నియమితులైన ఆరుగురిని మంత్రి అభినందిస్తూ, తమ బాధ్యతలను సమర్థంగా నిర్వహించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఈ సందర్భంగా నందిపాటి ఎల్.వి. సుబ్బా రెడ్డి, షైక్ ఈసుబ్ సలాం, లగుడు సంతోషి, సి.ప్రియవర్ధిని దత్, గొల్లవిల్లి భరత్ కుమార్, ఇయిత వెంకట రామయ్య అధికారులు తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ, మంత్రి గారి ద్వారా ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.






Printed,Published and owned by Chitta Vasavidevi Printed at Rama Offset Printers, 7th ward, Ponnuru, Guntur District-522 124 Andhra Pradesh and Published at 7th ward, Ayyappa Nagar, Ponnuru-522 124, Guntur District. Andhra Pradesh. Editor : Chitta Vasavidevi. RNI No.APTEL/2016/69464, Phone No.9346935672, kalamcounter@gmail.com